సాక్షి రాజన్న సిరిసిల్ల

శుక్రవారం । 27 । అక్టోబర్ । 2023

చంద్రప్రభ వాహనంపై విహారం

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం స్వామి వారు సూర్యప్రభ, చంద్ర ప్రభ వాహనాలపై పురవీధుల్లో విహరించారు. భక్తజనులు గోవింద నామస్మరణతో పులకించిపోయారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. సాయంత్రం 6 గంటలకు ప్రత్యేక అలంకరణతో రంగనాయక తిరుప్పోలం సేవ ఆకట్టుకుంది. ఆలయ ఈవో మారుతిరావు, ఏఈవోలు ప్రభాకర్, రవీందర్, ఆలయ మాజీ చైర్మన్లు ఉప్పల విఠల్‌రెడ్డి, చేపూరి నాగరాజు, తీగల శేఖర్‌గౌడ్, అర్చక కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.



న్యూస్‌రీల్

నేడు 'యువ ఆత్మీయ సమ్మేళనం'

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలో శుక్రవారం 'యువ ఆత్మీయ సమ్మేళనం' నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి గురువారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కేటీఆర్ హాజరవుతున్నారని వివరించారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని యువతీ, యువకులు పాల్గొంటారని, బీఆర్ఎస్ నాయకులు హాజరుకావద్దని చక్రపాణి కోరారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

• ఎస్పీ అఖిల్ మహాజన్



వేములవాడరూరల్: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్పీ అఖిల్‌మహాజన్ హెచ్చరించారు. వేములవాడరూరల్ మండలం ఫాజుల్‌నగర్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను గురువారం పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అక్రమ మద్యం, నగదు రవాణా చేస్తే 100 నంబర్‌కు కాల్ చేయాలని తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో తనిఖీల ద్వారా రూ.40,54,585 స్వాధీనం చేసుకుని జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్లు తెలిపారు. డీఎస్పీ నాగేంద్రచారి, సిబ్బంది ఉన్నారు.

కన్నవాళ్ల పోషణ బాధ్యత పిల్లలదే



సిరిసిల్లకల్చరల్: వయో వృద్ధులైన తల్లిదండ్రులను పోషించే బాధ్యత పిల్లలదేనని సీనియర్ సిటిజన్ల సంఘం అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య పేర్కొన్నారు. స్థానిక వస్త్ర, వ్యాపార సంఘం భవనంలో గురువారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. తల్లిదండ్రులను వేధించే పిల్లలకు తమ సంఘం కౌన్సిలింగ్ ఇస్తుందని, వినని వారిపై ఫిర్యాదులు చేస్తామన్నారు. వ్యాపార సంఘం కార్యదర్శి గౌడ రాజు, సీనియర్ సిటిజన్లు డాక్టర్ జనపాల శంకరయ్య, ఏనుగుల ఎల్లయ్య, శ్రీగాధ మైసయ్య, జేవీవీ సభ్యుడు రామరాజు, కోడం నారాయణ, దొంత దేవదాస్, గౌరిశెట్టి ఆనందం అంకారపు కృష్ణహరి, జ్ఞానోభ, కైలాసం, తడుక శ్రీహరి పాల్గొన్నారు.

నేడు కోజాగరి వ్రతపూజ

వేములవాడ: రాజన్న ఆలయంలో ఈనెల 27న కోజాగరి వ్రతపూజ నిర్వహిస్తున్నట్లు ఈవో కృష్ణప్రసాద్ గురువారం ప్రకటనలో తెలిపారు. శుక్రవారం రాత్రి నిషిపూజ అనంతరం కోజాగరి వ్రతం, మహాలక్ష్మీ పూజ నిర్వహించనున్నట్లు తెలిపారు.

'అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారు'





వేములవాడరూరల్: చేయని పనులను చేసినట్లు చెబుతూ అధికార పార్టీ నాయకులు అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారని వేములవాడ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ విమర్శించారు. హన్మాజిపేటలో గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తాను గెలిచిన నెల రోజుల్లోపే నక్కవాగు బ్రిడ్జి నిర్మాణానికి ప్రణాళిక రూపొందిస్తానని హామీ ఇచ్చారు. గ్రామానికి చెందిన దాదాపు 150 మంది బీఆర్ఎస్, బీజేపీల నుంచి కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఎంపీటీసీ శ్యామల, రూరల్ అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, వంగపల్లి మల్లేశం, రొండి రాజు, తిరుపతిరెడ్డి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ ప్రభాకర్, మల్లేశం, రమణారెడ్డి, అజ్జు, తీగల భూమయ్యగౌడ్, విక్కుర్తి రాజు పాల్గొన్నారు.

అభిమానం పచ్చబొట్టులా..

వేములవాడరూరల్: మండలంలోని మర్రిపల్లికి చెందిన గాలి సాయి తన చేతిపై ఆది శ్రీనివాస్ రూపాన్ని పచ్చబొట్టు వేయించుకుని అభిమానం చాటుకున్నాడు.

మూడు జిల్లాల మానకొండూర్

జంగ్ తెలంగాణ

- 2009లో నియోజకవర్గం ఆవిర్భావం
- బరిలో పాతకాపులే.. ప్రధాన పార్టీల మధ్యే పోటీ
- తొలిసారి ఆరెపల్లి, రెండుసార్లు రసమయి విజయం
- మూడోసారి అదృష్టాన్ని పరీక్షించుకోనున్న 'కవ్వంపల్లి!



సంవత్సరం	అభ్యర్థి	పోలైన ఓట్లు	ప్రత్యర్థి	పోలైన ఓట్లు
2009	ఆరెపల్లి మోహన్ (కాంగ్రెస్)	45,304	ఓరుగంటి ఆనంద్(టీఆర్ఎస్)	43,132
2014	రసమయి బాలకిషన్ (టీఆర్ఎస్)	85,010	ఆరెపల్లి మోహన్(కాంగ్రెస్)	38,088
2018	రసమయి బాలకిషన్(టీఆర్ఎస్)	88,997	ఆరెపల్లి మోహన్(కాంగ్రెస్)	57488

ఓటర్ల వివరాలు

పోలింగ్ బూత్‌లు	పురుషులు	స్త్రీలు	థర్డ్ జండర్	మొత్తం ఓటర్లు
316	1,07,371	1,11,041	1	2,18,413

మానకొండూర్: డీలిమిటేషన్‌లో భాగంగా 2009లో నేరెల్ల, ఇందుర్తి, కమలాపూర్, హుజూరాబాద్, కరీంనగర్ మండలాల్లోని పలు గ్రామాలతో మానకొండూర్ నియోజకవర్గం ఏర్పడింది. ప్రస్తుతం సిరిసిల్ల, సిద్దిపేట, కరీంనగర్ మూడు జిల్లాల పరిధిలో విస్తరించి ఉంది. ఇప్పటివరకు మూడుసార్లు ఇక్కడ అసెంబ్లీ ఎన్నికలు జరగగా, తొలిసారి కాంగ్రెస్, తర్వాత రెండుసార్లు టీఆర్ఎస్ విజయం సాధించాయి. నాలుగోసారి సైతం పాతకాపులే ఎన్నికల బరిలో దిగనున్నారు. ప్రతిసారీ గట్టి పోటీ ఉంటోంది.

జలవనరులు పుష్కలం

నియోజకవర్గంలో జలవనరులు పుష్కలంగా ఉన్నాయి. ఇల్లంతకుంట మండలంలోని అనంతసాగర్(అన్నపూర్ణ) ప్రాజెక్టు ద్వారా ఇల్లంతకుంట, బెజ్జంకి మండలాలకు సాగు నీరు అందుతోంది. మిడ్‌మానేరు, దిగువ మానేరు, తోటపల్లి, కల్వల రిజర్వాయర్ల ద్వారా నియోజకవర్గంలోని అన్ని మండలాలకు సాగు నీరు వెళ్తోంది. కరీంనగర్ జిల్లాలోనే ఎక్కడా లేని విధంగా ఈ నియోజవర్గంలో ప్రాజెక్టులు ఉన్నాయి. ఒకప్పుడు ఏడారిగా ఉన్న ఇల్లంతకుంట, బెజ్జంకి, గన్నేరువరం మండలాలు నేడు నీటితో కళకళలాడుతున్నాయి. అలాగే, తిమ్మాపూర్, మానకొండూర్ మండలాల్లోని మెట్ట ప్రాంతానికి ఈ ప్రాజెక్టులతో సాగునీరు అందుతుండటంతో నియోజకవర్గం పాడిపంటలతో విలసిల్లుతోంది. ఇంజినీరింగ్ తదితర కళాశాలలతో విద్యార్థులకు ఉన్నత చదువులు అందుబాటులోకి వచ్చాయి. వరి సీడ్ పాంట్లు జిల్లాలోనే మానకొండూర్, శంకరపట్నం మండలాల్లో అధికంగా ఉన్నాయి.

కాంగ్రెస్ నుంచి 'కవ్వంపల్లి'

కవ్వంపల్లి సత్యనారాయణ 2009లో పీఆర్పీ తరఫున పోటీ చేసి, 34,430 ఓట్లు, 2014లో టీడీపీ నుంచి పోటీ చేసి, 23,627 ఓట్లు సాధించారు. 2018లో పోటీ చేయలేదు. ఈసారి కాంగ్రెస్ నుంచి పోటీ చేయనున్నారు.

రెండుసార్లు రసమయిదే విజయం

2009లో కాంగ్రెస్ తరఫున ఆరెపల్లి మోహన్, టీఆర్ఎస్ తరఫున ఓరుగంటి ఆనంద్, పీఆర్పీ అభ్యర్థిగా కవ్వంపల్లి సత్యనారాయణ ఎన్నికల బరిలో నిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి టీఆర్ఎస్ అభ్యర్థిపై విజయం సాధించారు. 2014లో టీఆర్ఎస్ నుంచి రసమయి బాలకిషన్, కాంగ్రెస్ నుంచి ఆరెపల్లి మోహన్, టీడీపీ నుంచి కవ్వంపల్లి సత్యనారాయణ పోటీలో ఉన్నారు. టీఆర్ఎస్ అభ్యర్థి కాంగ్రెస్ అభ్యర్థిపై గెలుపొందారు. 2018లో టీఆర్ఎస్ నుంచి రసమయి బాలకిషన్, కాంగ్రెస్ నుంచి ఆరెపల్లి మోహన్ పోటీ పడ్డారు. ఈ ఎన్నికలు నువ్వా నేనా అన్నట్లు సాగగా.. రసమయి రెండోసారీ గెలిచారు. 2009లో పీఆర్పీ తరఫున, 2014లో టీడీపీ తరఫున పోటీ చేసిన కవ్వంపల్లి సత్యనారాయణ గట్టి పోటీ ఇచ్చి, ఓటమిపాలయ్యారు. 2018లో టీడీపీ, కాంగ్రెస్ పొత్తులో భాగంగా మానకొండూర్ సీటు కాంగ్రెస్‌కు కేటాయించడంతో సత్యనారాయణ ఆ పార్టీకి మద్దతు తెలిపారు.

'ఆరెపల్లి' ఈసారి బీజేపీ నుంచి!

మొదటి నుంచీ కాంగ్రెస్‌లో ఉన్న ఆరెపల్లి మోహన్ గత ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌లో చేరారు. ప్రస్తుతం బీజేపీలో చేరి, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. అలాగే, డాక్టర్ వృత్తి నుంచి రాజకీయాల్లోకి వచ్చిన కవ్వంపల్లి సత్యనారాయణ 2009కి ముందు కాంగ్రెస్‌లో చేరారు. ఆ పార్టీ నుంచి టికెట్ రాకపోవడంతో పీఆర్పీ నుంచి పోటీ చేసి, ఓటమి చెందాడు. ఆ తర్వాత 2014లో టీడీపీ నుంచి పోటీ చేసినా ఓడిపోయారు. తదనంతర రాజకీయ పరిణామాలతో కాంగ్రెస్‌లో చేరారు. ప్రస్తుతం ఆ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచి, మూడోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.



బలాలు.. బలహీనతలు నాయకులకు తెలుసు. మంచి నాయకుడు బలహీనతలు వదిలేస్తాడు. బలాలను పెంచుకుంటాడు.
– వారెన్ బెన్నిస్

మీకు తెలుసా?

ఓటు.. రకాలు



కరీంనగర్ అర్బన్: ఓటు వినియోగం సాధారణంగా అందరికీ ఒకే మాదిరిగా ఉంటుంది. కానీ అదే ఓటును కొన్ని సమయాల్లో వేరే పేర్లతో పిలుస్తారు. ఓటు వేసే సమయంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు కొన్ని ఓట్లను ఎన్నికల సంఘం ప్రవేశపెట్టింది. అంధులకు, చాలెంజ్, టెండర్, సర్వీస్ ఓటు ఇలా వినియోగించే అవకాశముంది.

టెండర్ ఓటు : ఎవరైనా వ్యక్తి ఓటు వేయడానికి వచ్చినప్పుడు అతడి ఓటు ఇంతకుముందే మరొకరు వేసినట్లయితే ప్రిసైడింగ్ అధికారి అతడికి బ్యాలెట్ ఓటు ఇచ్చి వేయించాలి. దీన్ని టెండర్ ఓటుగా పిలుస్తారు. ఈ సమాచారాన్ని ఫారం –17బీలో నమోదు చేయాలి.

సర్వీస్ ఓటు: ఎవరైనా సర్వీసు ఓటర్లు తమకు సంబంధించిన వ్యక్తుల ద్వారా ఓటు వేయడానికి ఎన్నికల అధికారుల ద్వారా ముందస్తు అనుమతి తీసుకుంటే వారి పేర్లు క్లాసిఫైడ్ సర్వీస్ ఓటరు లిస్ట్‌లో ఉంటుంది. అలాంటి వ్యక్తి ఓటు వేయడానికి వస్తే జాబితాలో చూసుకుని సాధారణ ఓటరు మాదిరి అతడికి ఓటు హక్కు కల్పిస్తారు.

చాలెంజ్ ఓటు: ఓటరు ఎవరైనా ఓటు వేయడానికి వచ్చినప్పుడు ఎన్నికల ఏజెంట్లు ఆ ఓటరుపై అభ్యంతరం వ్యక్తం చేస్తే సంబంధిత ఎన్నికల అధికారి ఫిర్యాదు చేసిన వ్యక్తి నుంచి రూ.2 రుసుం తీసుకుని రసీదు ఇస్తారు. వచ్చిన ఓటరు నిజమైనవారా, కాదా అని విచారిస్తారు. నిజమైన వారని తేలితే అతడికి ఓటు హక్కు కల్పించి రూ.2 రుసుంను జప్తు చేస్తారు. అతను నిజమైన వారు కాదని తేలితే ఓటరు నుంచి రూ.2 తీసుకుని ఏజెంట్‌కు అందించి ఓటు వేసేందుకు అనర్హుడిగా ప్రకటిస్తారు.

ఈడీసీ ఓటు: ఎన్నికల సిబ్బంది ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్(ఈడీసీ) కలిగి ఉంటే అతడి వివరాలు మార్క్‌డ్ కాపీలో చివర నమోదు చేస్తారు. సాధారణ ఓటరు మాదిరి ఓటింగ్ సౌకర్యం కల్పిస్తారు.

టెస్ట్: ఓటరు ఓటింగ్ కంపార్ట్‌మెంట్‌లోకి వెళ్లి ఓటు వేసిన తర్వాత వీవీప్యాట్ నుంచి వచ్చే స్లిప్‌లో తాను ఓటు వేసిన వ్యక్తికి పడలేదని తెలిపితే రాత పూర్వకంగా ఫిర్యాదు తీసుకుంటారు. అతనికి మరోసారి బ్యాలెట్ ఇస్తారు. ఓటు వేసేందుకు మరోసారి వెళ్లేటప్పుడు అతనితోపాటు పోలింగ్ ఏజెంట్‌ను తీసుకెళ్లి వారి సమక్షంలో ఓటు వేయిస్తారు. వేసిన ఓటుకు వచ్చిన స్లిపు తేడా ఉంటే ఆర్వోకు సమాచారం ఇచ్చి ఓటింగ్ ప్రక్రియ నిలిపివేస్తారు. వేసిన ఓటుకు వీవీప్యాట్‌లో వచ్చిన స్లిప్‌కు తేడా లేకుంటే ఆ సమాచారాన్ని 17 సీలో నమోదు చేయడంతోపాటు ఏ అభ్యర్థికి ఓటు రికార్డు చేశారనే విషయాన్ని స్పష్టంగా రాస్తారు.

నాట్ టు ఓటు: ఒక వ్యక్తి పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించి బ్యాలెట్ ఇచ్చిన తర్వాత ఓటు వేయనని అంటే అతని కోరిక మేరకు పీవో అతడిని బయటకు పంపిస్తారు. నాట్–టు–ఓటు అని రాసి ఆ ఓటును వేరే ఓటరుకు ఇస్తారు.

సమాజంలో రెండు వర్గాలు ఉంటాయి. ఒక వర్గం పని చేసే వారైతే.. మరొక వర్గం పేరు కోసం తపించేవారు. మొదటి వర్గం వైపు ఉండడం ఉత్తమం.
– ఇందిరాగాంధీ



లావాదేవీలపై నిఘా పెట్టండి

• కలెక్టర్ అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: బ్యాంక్ లావాదేవీలపై నిఘా పెట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. నిత్యం ఒకే ఖాతా నుంచి రూ.లక్ష విత్‌డ్రా చేయడం, లేదా రూ.లక్ష జమ చేయడం జరిగితే ఆ వివరాలు అందించాలని కోరారు. కలెక్టరేట్‌లో గురువారం బ్యాంకు అధికారులతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల్లో అనుమానిత నగదు లావాదేవీలపై దృష్టి సారించాలన్నారు. భారీగా నగదు జమ, విత్‌డ్రాల సమాచారాన్ని ఎన్నికల అకౌంటింగ్ నోడల్ ఆఫీసర్‌లకు రోజువారీగా నివేదిక ఇవ్వాలని సూచించారు. ఏటీఎంలలో నగదు డిపాజిట్ చేయడానికి వినియోగించే వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు, సంబంధీకుల ఖాతాల్లో నగదు లావాదేవీల వివరాలు అందించాలని సూచించారు. ఎవరైనా నెలలో రూ.10 లక్షలకు పైగా నగదు డ్రా చేసినా, బదిలీ చేసినా సమాచారం అందించాలన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు యూపీఐ ద్వారా గూగుల్‌పే, ఫోన్‌పే, ఇతర యాప్‌ల ద్వారా డబ్బులు జమయితే వెంటనే తెలపాలని బ్యాంకర్లను ఆదేశించారు. సాధారణ ప్రజలకు ఇబ్బందులు రానీయకుండా చూడాలన్నారు. జిల్లా లీడ్ బ్యాంక్ అధికారి మల్లికార్జున్‌రావు, ఎన్నికల లెక్కల నోడల్ అధికారి రామకృష్ణ, జిల్లా ఆడిట్ అధికారి స్వప్న, ఐటీ నోడల్ అధికారి మహమ్మద్ రఫీ, బ్యాంకుల మేనేజర్లు, కో–ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాలు జరగాలి

జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ ప్రసవాలు జరిగేలా వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ కోరారు. కలెక్టరేట్‌లో గురువారం సాయంత్రం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షించారు. 24 గంటలు పనిచేసే పీహెచ్‌సీలలో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. ఆరోగ్య మహిళలో గుర్తించిన అనుమానిత క్యాన్సర్ కేసులపై దృష్టి పెట్టి, జిల్లా ఆస్పత్రికి రిఫరల్ చేస్తూ పరీక్షలు చేసుకునేలా మానిటర్ చేయాలని సూచించారు. 'కిరణం'లో మెంటల్ హెల్త్‌కు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మెడికల్ కళాశాలకు సంబంధించి పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని, లిఫ్ట్‌ను అందుబాటులోకి తేవాలని సూచించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్, జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు, జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకులు మురళీధర్‌రావు, వైద్యులు శ్రీరాములు, రజిత, వేములవాడ ఏరియా ఆస్పత్రి పర్యవేక్షకులు మహేశ్‌రావు పాల్గొన్నారు.

నాణ్యమైన ఫీడింగ్ ఇవ్వాలి

సిరిసిల్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు నాణ్యమైన ఫీడింగ్ ఇవ్వాలని, అంగన్‌వాడీ టీచర్లు ఇంగ్లిష్ భాషపై పట్టుపెంచుకోవాలని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం సూచించారు. సిరిసిల్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీస్‌లో గురువారం తంగళ్లపల్లి మండల అంగన్‌వాడీ టీచర్ల సమావేశంలో మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు రోజు ఆంగ్లంలో మాట్లాడాలని, మంచి అలవాట్లను బోధించాలని సూచించారు. సీడీపీవో ఆనందిని, సూపర్‌వైజర్ సుష్మిత, జిల్లా పోషణ అభియాన్ కోఆర్డినేటర్ బాలకిషన్, జిల్లా మహిళా సాధికారత కోఆర్డినేటర్ రోజా, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ పరమేశ్వర్ పాల్గొన్నారు.

ఐదుగురికే అనుమతి..



- నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు
- జనరల్ అభ్యర్థులకు ఫీజు రూ.10వేలు
- ఎస్సీ, ఎస్టీలకు రూ.5వేలు
- పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్
- 'సాక్షి'తో సిరిసిల్ల ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆనంద్‌కుమార్

సాక్షి ఇంటర్వ్యూ

సిరిసిల్ల: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేస్తున్నామని సిరిసిల్ల ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఆర్డీవో) ఎన్.ఆనంద్ కుమార్ తెలిపారు. అభ్యర్థితోపాటు మరో నలుగురికి మాత్రమే ఈఆర్వో వద్దకు అనుమతి ఇస్తామని.. సిరిసిల్ల నియోజకవర్గంలో కొత్తగా ఐదు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, పెరిగిన ఓటర్లకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాల సంఖ్యను పెంచినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణతోపాటు నామినేషన్ల స్వీకరణపై గురువారం 'సాక్షి'తో మాట్లాడారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

నామినేషన్ల స్వీకరణ

నవంబర్ 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తాం. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు దాఖలుకు ఎన్నికల కమిషన్ సమయాన్ని నిర్దేశించింది. సిరిసిల్ల ఆర్డీవో ఆఫీస్‌లోనే నామినేషన్లు స్వీకరిస్తాం. ఆర్డీవో ఆఫీస్‌కు వంద మీటర్ల దూరం వరకు ఎలాంటి వాహనాలు అనుమతించరు. వంద మీటర్ల అవతల వరకు ఒక్కో అభ్యర్థికి మూడు వాహనాలను మాత్రమే అనుమతిస్తారు. దాఖలైన నామినేషన్లను నవంబరు 13వ తేదీన పరిశీలిస్తాం. ఉపసంహరణకు నవంబరు 15వ తేదీన అవకాశం ఉంది. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులకు అదే రోజు గుర్తులు కేటాయిస్తాం. నవంబరు 30వ తేదీన పోలింగ్ నిర్వహిస్తాం.

నామినేషన్ ఫీజు రూ.10వేలు

ఎన్నికల్లో పోటీ చేసే వ్యక్తి రూ.10వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5వేలు చెల్లిస్తే సరిపోతుంది. అయితే కులధ్రువీకరణపత్రం సమర్పించాలి. నామినేషన్ ఫీజును నగదు రూపంలో, లేదా ఎస్‌టీవో ద్వారా చలానా తీసి ఇవ్వవచ్చు. చెక్కులు, డీడీలు చెల్లవు. గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ పార్టీలకు సంబంధించిన అభ్యర్థులకు ఒక్కరు, గుర్తింపు పొందని పార్టీ లేదా స్వతంత్ర అభ్యర్థులకు పది మంది ప్రతిపాదించాలి. అభ్యర్థులు తమ నేరచరిత్రను, ఆస్తులు, అప్పుల వివరాలను ఫామ్–26 ద్వారా అఫిడవిట్ రూపంలో ఇవ్వాలి.

ఆధారాలు చూపితే డబ్బులు వాపస్

నియోజకవర్గం పరిధిలో ఇప్పటి వరకు రూ.18,22,660 నగదు పట్టుబడింది. నగదుకు సంబంధించిన ఆధారాలు చూపడంతో రూ.3,52,160 విడుదల చేశాం. మిగతా డబ్బుకు సంబంధించిన వారికి నోటీసులు ఇచ్చి ఆదాయపన్నుశాఖకు అప్పగించాం. నగదుకు సంబంధించిన ఆధారాలు చూపితే వాపస్ ఇస్తాం.

48 గంటల ముందు..

ప్రచారానికి, సభలు, సమావేశాలకు, వాహనాలకు, మైకు అనుమతులకు సంబంధించి నేరుగా సువిధ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. 15 రకాల అనుమతులు జారీచేస్తున్నాం. ఎవరైనా 48 గంటల ముందు దరఖాస్తు చేసుకోవాలి. ఆ దరఖాస్తులను పరిశీలించి సంబంధిత శాఖల ద్వారా ఎన్‌వోసీ తీసుకుని అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. నేరుగా మా ఆఫీస్‌కొచ్చినా.. సువిధ పోర్టల్‌లోనే నమోదు చేసి 48 గంటల తరువాత అనుమతులు జారీ చేస్తాం.

మోడల్ పోలింగ్ కేంద్రం..

సిరిసిల్లలోని ఏదో ఒక్క పోలింగ్ కేంద్రాన్ని మహిళల కోసం మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తాం. అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నాం. పోలింగ్ శాతాన్ని పెంచేందుకు స్వీప్ ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నాం. నియోజకవర్గంలో సాఫీగా, సవ్యంగా, ప్రశాంతంగా, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేశాం. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించాలి.

పెరిగిన ఓటర్ల సంఖ్య

సిరిసిల్ల నియోజకవర్గం పరిధిలో మొత్తం ఓటర్ల సంఖ్య 2,40,917. ఇందులో పురుషులు 1,17,986, మహిళలు 1,22,925, థర్డ్ జెండర్ ఆరుగురు ఉన్నారు. గత ఎన్నికల్లో 282 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. ఈసారి ఐదు కేంద్రాలు పెరిగాయి. ఇందులో రాచర్ల గొల్లపల్లి, సిరిసిల్లలోని పద్మనగర్, తంగళ్లపల్లి మండలం పాపయ్యపల్లి, మల్లాపూర్, మండెపల్లి ఐటీఐ కాలేజీలో కొత్తగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశాం. జిల్లాలోని 287 పోలింగ్ కేంద్రాలకు 50 శాతం కేంద్రాల్లో, సమస్యాత్మక కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నాం.

ఏళ్లనాటి సమస్యలు పరిష్కరించాం

• చల్మెడ లక్ష్మీనరసింహారావు



గొల్లపల్లిలో ప్రచారం చేస్తున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు

కోనరావుపేట(వేములవాడ): ఏళ్లనాటి సమస్యలు పరిష్కరించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని ఆ పార్టీ వేములవాడ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు పేర్కొన్నారు. కాళేశ్వరం జలాలతో మండలానికి తాగు, సాగునీరు అందించామన్నారు. మండలంలోని మామిడిపల్లి, బావుసాయిపేట, గోవిందరావుపేటతండా, వట్టిమల్ల, గొల్లపల్లి, కమ్మరిపేటతండా, భుక్యారెడ్డితండా, మరిమడ్ల, అజ్మీరాతండా, కొండాపూర్ గ్రామాల్లో గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గతంలో కురిసిన వర్షాలకు మూలవాగుపై వంతెనలు కూలిపోతే మంత్రి కేటీఆర్ చొరవతో రూ.52కోట్లు మంజూరైన విషయాన్ని గుర్తు చేశారు. పల్లెల్లో మౌలిక వసతులు దరిచేరాయన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ చంద్రయ్యగౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, సింగిల్‌విండో చైర్మన్ సంకినేని రామ్మోహన్‌రావు, యూత్ అధ్యక్షుడు జీవన్‌గౌడ్, మహిళా విభాగం అధ్యక్షురాలు చీటి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శంషాబాద్ ఎయిర్ పోర్టులో ఫైన్ ఆర్ట్స్ విద్యార్థినులు


ఎయిర్ పోర్టులో విద్యార్థినులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన మహిళా ఫైన్ ఆర్ట్స్ కళాశాల విద్యార్థినులు గురువారం శంషాబాద్ ఎయిర్ పోర్టులో క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఇంటీరియర్ డిజైన్ విద్యార్థినులు కెఫిన్ టెక్ కంపెనీ ఆధ్వర్యంలో ఎయిర్ పోర్టులో మెలకువలు నేర్చుకున్నారని ప్రిన్సిపాల్ కె.రజని తెలిపారు. కంపెనీకి కృతజ్ఞతలు తెలిపారు.

మోసం చేశారని ఫిర్యాదు

కోనరావుపేట: భూమికి తమ వద్ద డబ్బులు తీసుకొని మరొకరికి విక్రయించిన హెడ్ కానిస్టేబుల్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితురాలు, మాజీ జెడ్పీటీసీ గొట్టె రుక్మిణి తహసీల్దార్ కు బుధవారం ఫిర్యాదు చేశారు. కోనరావుపేట రైతువేదిక పక్కన గల సర్వే నంబర్లు 374/ఈ, 374/సీ, 374/డీలో గల 12 గుంటల భూమిని హెడ్ కానిస్టేబుల్ అయిన యాస నారాయణ, అతని సోదరులు శంకరయ్య, రామస్వామి కలిసి విక్రయించారన్నారు. ఇందుకోసం రూ.లక్ష బయానా ఇచ్చామని చెప్పారు. భూయజమానులు తమకు రిజిస్ట్రేషన్ చేయకుండా వేరేవారికి రిజిస్ట్రేషన్ చేశారన్నారు. ఈ విషయంపై విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి


మాట్లాడుతున్న ఎల్లారెడ్డి

వేములవాడఅర్బన్: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎగుమంటి ఎల్లారెడ్డి అన్నారు. వేములవాడ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా రైతులు పండించిన వరి ధాన్యం పంట కోసం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి కొనుగోళ్లు ముమ్మరం చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతులు దళారులకు తక్కువ ధరలకు అమ్మి నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మల్లారెడ్డి ప్రశాంత్, అశోక్, వేణు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


యాదగిరి(ఫైల్)

ముస్తాబాద్: కుటుంబాన్ని పోషించేందుకు చేసిన అప్పులు ఒకవైపు, చేతికొచ్చిన మొక్కజొన్న పంటను కోతులు నాశనం చేయడంపై బాధ మరోవైపు ఉండగా ఇంట్లో తెలిసిన కలహాలతో ఓ రైతు బలయ్యాడు. ఎస్సై శేఖర్‌రెడ్డి, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాలు. మండలంలోని బందనకల్ కు చెందిన చింతల యాదగిరి(42)కి గ్రామశివారులో మూడెకరాల వ్యవసాయ భూమిలో వరి, మొక్కజొన్న సాగుచేస్తున్నాడు. కుటుంబ పోషణ కోసం గతంలో అప్పులు చేశాడు. వారం క్రితం మొక్కజొన్న పంటను కోతులు ధ్వంసం చేశాయి. దీంతో యాదగిరి కుటుంబంలో కలహాలు వచ్చాయి. తీవ్ర మనోవేదనకు గురై బుధవారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లి చేనులోనే పురుగుల మందు తాగాడు. గమనించిన చుట్టుపక్కల రైతులు అపస్మారక స్థితిలో ఉన్న యాదగిరిని ముస్తాబాద్ లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడికి భార్య శారద, కుమారులు శేఖర్, పవన్, కూతురు శ్రావణి ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇక్కడి పైసలు ఇక్కడ్నే ఖర్చు చేయాలే

- కార్మిక డిక్లరేషన్ చేస్తేనే మద్దతు
- డీఎంఎఫ్‌టీ నిధులతో అభివృద్ధి చేయాలి
- స్పష్టత ఇవ్వకపోతే నోటాకే ఓటు
- కోలిండియాలో లేని హక్కులు స్వరాష్ట్రంలో సిద్ధించాయి
- 'సాక్షి చర్చావేదిక'లో సింగరేణి కార్మిక సంఘాల నాయకులు



రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని పార్టీలు సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డిక్లరేషన్ ప్రకటించాలని కార్మిక సంఘాలు నాయకులు డిమాండ్ చేశారు. ఏ పార్టీలు తమ డిమాండ్లకు పెద్దపీట వేస్తాయో.. వాటికే తాము మద్దతు పలుకుతామని తేల్చిచెప్పారు. సింగరేణి కార్మికుల ఎజెండాపై గురువారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన 'సాక్షి చర్చావేదిక'లో అన్ని గుర్తింపు, జాతీయ, విప్లవ కార్మిక సంఘాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలకు పరిష్కారం చూపేలా నాయకులు తమ ఆలోచనలను పంచుకున్నారు.

– సాక్షిప్రతినిధి,కరీంనగర్/సాక్షి, పెద్దపల్లి /గోదావరిఖని

హామీలతో మభ్యపెట్టవద్దు



మహిళ, బీసీ, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ మాదిరిగా సింగరేణి కార్మికులకు అన్ని పార్టీలు డిక్లరేషన్ ప్రకటించాలి. తమ తమ మేనిఫెస్టోల్లో కార్మికుల సమస్యలను చేర్చాలి. ఓట్ల కోసం హామీలతో మభ్యపెట్టవద్దు. డిమాండ్లపై స్పష్టత లేకపోతే నోటాకే ఓటు.

– రియాజ్ అహ్మద్, హెచ్ఎంఎస్

వయోపరిమితి పెంచాలి



సింగరేణి కార్మికుల సంఖ్య 1.16 లక్షల నుంచి 39 వేలకు పడిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణిలో కొత్తగా ఇచ్చామంటున్న ఉద్యోగాలు ఎక్కడికి పోయాయి? రెండు పేర్లతో పనిచేస్తున్నవారి సమస్య పరిష్కరించాలి. వారసత్వ ఉద్యోగాల వయోపరిమితి 40 ఏళ్లకు పెంచాలి.

– కె.విశ్వనాథ్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు


'సాక్షి' ఆధ్వర్యంలో చర్చావేదికలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

పరిశ్రమలు నెలకొల్పాలి



సింగరేణి మనుగడను కాపాడాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కార్మికులను విస్మరిస్తూ మారుస్తోంది. కేంద్రం బ్లాకులను వేలం వేస్తే రాష్ట్ర సర్కార్ కొని, సింగరేణికి కేటాయించాలి. బొగ్గు ఆధారిత పరిశ్రమలను నెలకొల్పాలి.

– జి.రాములు, ఏఐఎఫ్‌టీయూ నేత

ప్రభావిత ప్రాంతాల్లో వసతులేవీ?



సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో ఖర్చు చేయాల్సిన డీఎంఎఫ్‌టీ నిధులను సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్లో వెచ్చిస్తున్నారు. బొందల గడ్డగా మారుతున్న ప్రభావిత ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించడం లేదు. సంస్థలో రాజకీయ జోక్యం పెరిగింది.

– రాజన్న, సింగరేణి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు

చట్ట సవరణ చేయాలి



ప్రధాని మోదీ సింగరేణిని కార్పొరేట్ కంపెనీలపరం చేస్తున్నారు. గతంలో ఇందిరాగాంధీ బొగ్గు గనులకు జాతీయం చేయడంతో సుమారు 6 లక్షల మంది కార్మికులకు లాభం చేకూరింది. ఆదాయ పన్ను మాఫీ లేదా స్లాబ్ పెంపు అమలుకు చట్టసవరణ చేయాలి.

– జనక్‌ప్రసాద్, సెక్రటరీ జనరల్, ఐఎన్‌టీయూసీ

కాంగ్రెస్ వల్లే తెరపైకి ప్రైవేటీకరణ



గత కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతోనే ఇప్పుడు బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణ అంశం తెరపైకి వచ్చింది. కార్మికుల హక్కుల సాధనలో బీఎంఎస్ రాజీలేని పోరాటం చేస్తోంది. 11వ వేతన ఒప్పందం కోసం అహర్నిశలు కృషి చేసింది.

– యాదగిరి సత్తయ్య, బీఎంఎస్ అధ్యక్షుడు

2, 3 నెలల జీతం పన్నుకే



తెలంగాణ ఉద్యమ సమయంలో పాలక పార్టీ 50 వేల మందికి కొత్తగా ఉద్యోగాలు కల్పిస్తాం, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తాం, బొగ్గు ఆధారిత పరిశ్రమలు నెలకొల్పుతామని చెప్పి, మరిచింది. 2, 3 నెలల జీతం ఆదాయ పన్నుకే పోతోంది.

– టి.శ్రీనివాస్, ఐఎఫ్‌టీయూ ఆలిండియా ప్రధాన కార్యదర్శి

బినామీ పేర్లను సవరించాలి



సింగరేణిలో బినామీ పేర్లతో పని చేస్తున్న కార్మికుల పేర్లను సవరించాలి. గోదావరిఖనిలో ఉన్నా స్వచ్ఛమైన తాగు నీరందక కార్మిక కుటుంబాలు ఆస్పత్రుల పాలవుతున్నాయి. కార్మికులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, కార్పొరేట్ వైద్యం అందించాలి.

– తుమ్మల రాజారెడ్డి, సీఐటీయూ అధ్యక్షుడు

రాజకీయ జోక్యం పెరిగింది



సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగింది. కార్మిక సంఘాల ఉనికి పూర్తిగా తగ్గిపోయింది. మారుపేర్ల మార్పు రెగ్యులరైజ్ చేయాలి. కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలి. నాలుగు బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించాలి.

– వాసిరెడ్డి సీతారామయ్య, ఏఐటీయూసీ అధ్యక్షుడు

ఆదాయ పన్ను మినహాయించాలి



సింగరేణి కార్మికులకు ఆదాయ పన్ను మినహాయింపు ఇవ్వాలి. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేసి పంపి నప్పటికీ కేంద్రం పార్లమెంట్ లో ఆమోదించలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం, టీబీజీకేఎస్ నిరంతరం కార్మికుల కోసం పని చేస్తున్నాయి.

– కెంగర్ల మల్లయ్య, టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

మహిళా సంక్షేమానికి ప్రాధాన్యం

- కాంగ్రెస్ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం


కోరెంలో గ్రామస్తులకు సమస్యలిస్తున్న సత్యం

బోయినపల్లి(చొప్పదండి): రాష్ట్రంలో మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ అధిక ప్రాధాన్యమిస్తుందని చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. వస్తున్నా మీ సేవకై లో భాగంగా గురువారం రాత్రి మండలంలోని కోరెం గ్రామంలో గడప గడపకు కాంగ్రెస్.. పల్లె పల్లెకు సత్యమన్న కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు రూ.500కే సిలిండర్, మహాలక్ష్మి, చేయూత పథకాలతో పాటు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలు చేస్తుందని తెలిపారు. మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, ఏనుగుల కనుకయ్య, బీరెడ్డి మహేశ్‌రెడ్డి, ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్, బోయిని ఎల్లేశ్, పర్శరాములు, నిమ్మ వినోద్‌రెడ్డి, పిట్టల మోహన్, సాన సత్యం, మల్యాపురం అనిల్, నల్ల మోహన్, గుంటి జలేందర్, ఎండీ బాబు, నక్క శ్రీకాంత్, ఆకుల అజయ్, జాగీరు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వస్తే అంధకారమే..

- టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు


ముస్తాబాద్‌లో ప్రచార రథం ప్రారంభిస్తున్న రవీందర్‌రావు

ముస్తాబాద్(సిరిసిల్ల): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తెలంగాణ రాష్ట్రం అంధకారంలో మగ్గనుందని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. ముస్తాబాద్ ఏఎంఆర్ గార్డెన్స్‌లో బీఆర్ఎస్ ఎన్నికల సన్నాహక సమావేశం గురువారం జరిగింది. రవీందర్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాకముందు రాష్ట్రంలోని పరిస్థితులను నేటి యువతకు వివరించాలన్నారు. అనంతరం ఎన్నికల ప్రచార రథాన్ని రవీందర్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎంపీపీ జనగామ శరత్ రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గోపాల్ రావు, ఏఎంసీ చైర్మన్ అక్కరాజు శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ బాపురావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, పట్టణాధ్యక్షుడు నర్సింహారెడ్డి, విజయరామారావు, కొమ్ము బాలయ్య, కిషన్‌రావు, సుమతి, యాదగిరి పాల్గొన్నారు.

రసమయికి మద్దతు పలికిన మహిళలు


ఎమ్మెల్యే బాలకిషన్‌ను సన్మానిస్తున్న మహిళలు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు ఇల్లంతకుంట మండల మహిళలు మద్దతు ప్రకటించారు. గురువారం అనంతగిరి, వల్లంపట్ల గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. గ్రామ మహిళలు రసమయికి సంపూర్ణ మద్దతు ప్రకటించి కాలువతో సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతి దళిత కుటుంబానికి రూ.10లక్షల సాయం చేస్తోందని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను ఆశీర్వదించండి

- జిల్లా అధ్యక్షుడు ఆగయ్య


ప్రచార రథం ప్రారంభిస్తున్న ఆగయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపిస్తే మళ్లీ రాష్ట్రం అంధకారంలోకి వెళ్తుందని, సంక్షేమ ప్రభుత్వాన్ని కొనసాగించేందుకు ఓటేసి మూడోసారి ఆశీర్వదించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గురువారం ఎన్నికల ప్రచార రథాన్ని ఆయన ప్రారంభించారు. ఆగయ్య మాట్లాడుతూ.. ఎన్నికల నియమావళి ప్రకారం ప్రచార రథంతో తమ ప్రచారాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, ఎంపీటీసీలు నాగరాజు, అనసూయ, నాయకులు అందె సుభాష్, రమేశ్, నర్సింహారెడ్డి, సీత్యానాయక్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు దుర్వినియోగం కాలేదు

వేములవాడరూరల్: గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు చేసి నెలల తరబడి బిల్లులు రాకున్నా ఇబ్బందులు పడుతున్నామని, పంచాయతీ కార్యదర్శుల తప్పిదంతోనే జరిగిన పొరపాటని, తాము ఎలాంటి నిధులు దుర్వినియోగం చేయలేదని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిధుల దుర్వినియోగంపై సర్పంచులకు జిల్లా అధికారుల నుంచి నోటీసులు జారీ అయిన దానిపై "సాక్షి" దినపత్రికలో బుధవారం వచ్చిన కథనం పై వారు స్పందించారు. వట్టెంల, ఫాజుల్‌నగర్ గ్రామాల్లో నిధుల దుర్వినియోగంపై అధికారులు ఇచ్చిన నోటీసు కార్యదర్శులు అవగాహన లేక జరిగిన పొరపాటని తెలిపారు. అన్ని ఆధారాలు ఎంపీడీ రికార్డులో నమోదు చేసిన తరువాత అదనపు నిధులు తీసుకోవడం జరిగిందని వారు తెలిపారు.

అక్రమ మద్యం పట్టివేత

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలం మొర్రాపూర్ తండాలోని ఓ ఇంట్లో నిల్వ చేసిన బీరు బాటిళ్లను గురువారం స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్ తెలిపారు. ఇంట్లో బీర్లు విక్రయిస్తుండగా రూ.2వేల విలువైన 12 బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని అన్నారు. మొర్రాపూర్ తండా శివారులో సారా తయారీ కేంద్రాలపై ఆబ్కారీ సిబ్బంది దాడులు చేసిందన్నారు. గ్రామ శివారులో సారా తయారీకి వినియోగించే బెల్లం పానకాలను ధ్వంసం చేశారని తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఎస్సై శైలజ, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్‌రావు, ఆలీ, కిశోర్, మల్లేశ్, కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటా.. ఆశీర్వదించండి



గంభీరావుపేట(సిరిసిల్ల): తనను గెలిపిస్తే ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానని, ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సిరిసిల్ల నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థి పిట్టల భూమేశ్ పేర్కొన్నారు. గంభీరావుపేటలో గురువారం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వర్దవెల్లి స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

600 మంది రక్తదాతలు

- సిరిసిల్లలో మెగా రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న పోలీసులు


పాల్గొన్న ఎస్పీ అఖిల్‌మహాజన్, డీఎస్పీ ఉదయ్‌రెడ్డి

సిరిసిల్లక్రైం: ఆపద సమయంలో ఆపన్నులకు రక్తం ఇచ్చి ఆదుకునే వారు ప్రాణదాతలుగా నిలుస్తారని ఎస్పీ అఖిల్ మహాజన్ కొనియాడారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా స్థానిక పద్మనాయక కల్యాణ మండలంలో గురువారం సిరిసిల్ల, కరీంనగర్, మంచిర్యాల రెడ్ క్రాస్ సొసైటీ, పోలీసుశాఖ సంయుక్తంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు, పోలీస్ సిబ్బంది దాదాపు 600 మంది రక్తదానం చేశారు. రక్తదాతలకు పోలీసుశాఖ తరఫున ప్రశంసాపత్రాలు అందించారు. రక్తం తలసేమియా, సికిల్‌సెల్, డెంగీ వ్యాధిగ్రస్తులకు చాలా అవసరం ఉంటుందని తెలిపారు. రక్తదాతలు భావితరాలకు మార్గదర్శకులుగా నిలుస్తారన్నారు. ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు ఉదయ్‌రెడ్డి, నాగేంద్రచారి, రవికుమార్, సీఐలు ఉపేందర్, సదన్‌కుమార్, శశిధర్‌రెడ్డి, కరుణాకర్, కృష్ణకుమార్, కిరణ్‌కుమార్, అనిల్‌కుమార్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు గడ్డ రవి, వరంగల్ అధ్యక్షుడు శ్రీనివాస్, కరీంనగర్ అధ్యక్షుడు కేశవరెడ్డి, మంచిర్యాల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

16సార్లు రక్తదానం చేశా



ఇప్పటి వరకు పదహారు సార్లు రక్తదానం చేశాను. ఇలా చేయడం వల్ల ఒకరికి సహాయం చేశానన్న ఆనందం ఉంటుంది. యువకులు రక్తదానానికి ముందుకు రావాలి.

– ఎడపల్లి మల్లేశం, తడగొండ

ఎప్పుడైనా ఇస్తాను



ఆపదలో ఉన్న వారు సంప్రదిస్తే ఎప్పుడైనా వెళ్లి రక్తం ఇస్తాను. నాకు వీలుకాకపోతే స్నేహితులను పంపుతాను. రక్తదానం చేయాలని ప్రచారం చేస్తున్నాను. ఇప్పటికే 24 సార్లు రక్తదానం చేశాను.

– మర్రిపెల్లి విశాల్, రుద్రంగి

అపోహలు తొలగించేలా చేస్తా



రక్తదానం చేస్తే ఏదో జరుగుతుందన్న అపోహలు తొలగించేందుకు నా ప్రయత్నం చేస్తున్నాను. ఇప్పటి వరకు 13 సార్లు రక్తదానం చేశాను. రక్తమిస్తే బలహీనపడతారన్న దానిలో వాస్తవం లేదు.

– ఎల్.శ్రీకాంత్, ఎస్సై, సిరిసిల్ల

సామాజిక సేవలో భాగమే..



సామాజిక సేవలో భాగంగానే రక్తదానం చేస్తాను. పోలీస్ కొలువు కోసం ప్రయత్నించే వారికి ఉచిత కోచింగ్ ఇచ్చినట్లుగానే.. రక్తదానం చేయడంతోపాటు చాలా మందిని ప్రోత్సహించాను. ఇప్పటికి 32 సార్లు రక్తదానం చేశాను.

– రాజశేఖర్, కానిస్టేబుల్, వేములవాడరూరల్

మాజీ సర్పంచుల డిమాండ్లు నెరవేర్చాలి

- సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బొడ్డు దేవయ్య


సిరిసిల్లలో మాజీ సర్పంచుల సమావేశం

సిరిసిల్ల: మాజీ సర్పంచుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని తెలంగాణ మాజీ సర్పంచుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బొడ్డు దేవయ్య కోరారు. సిరిసిల్లలో గురువారం మాజీ సర్పంచుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవయ్య మాట్లాడుతూ.. మాజీ సర్పంచులకు రూ.10వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. మాజీ సర్పంచుల డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ గతంలో దీక్షలు చేశామని గుర్తు చేశారు. సిరిసిల్ల నియోజకవర్గంలో 114 మంది మాజీ సర్పంచులు ఎన్నికల్లో నామినేషన్లు వేసేందుకు సిద్ధమైనట్లు వివరించారు. మాజీ సర్పంచుల నూతన కార్యవర్గాన్ని నియమించినట్లు బొడ్డు దేవయ్య ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా మిర్యాలకర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా దేవున నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా పీసరి తుకారాం, కోశాధికారిగా రెకారెడ్డి, గౌరవ సలహాదారుడిగా గుర్రం సత్తయ్యను ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏరెడ్డి మల్లారెడ్డి, అధికార ప్రతినిధులు మల్లేశంగౌడ్, వెంకటాపురం మహేందర్, ఎల్లయ్య, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా 'వెంకన్న' కల్యాణోత్సవం

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం లింగన్నపేటలో శ్రీవెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించిన వేడుకను భక్తులు తిలకించారు. ఉత్సవాల నిర్వాహకులు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది.

ధాన్యం కొనుగోళ్లు సజావుగా చేపట్టాలి

- జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్


మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్

సిరిసిల్ల: జిల్లాలో వానాకాలం ధాన్యం కొనుగోళ్లను సజావుగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లా పౌరసరఫరాల అధికారులు, రైస్ మిల్లర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఖరీఫ్ సీజన్ 2023–24లో 3.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జిల్లాలో 258 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, ఐందులో ఐకేపీ ఆధ్వర్యంలో 45, సింగిల్‌విండోల పరిధిలో 200, డీసీఎంఎస్ పరిధిలో 9, మెప్మా పరిధిలో 4 కేంద్రాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల్లో మంచినీరు, విద్యుత్ సౌకర్యం, నీడ వసతి కల్పించాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, ప్రభుత్వానికనుగుణంగా నాణ్యతా ప్రమాణాల మేరకు ధాన్యం కొనుగోలు చేయాలని, ప్రతి కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్లు, తేమ కొలిచే యంత్రాలు, ప్యాడీ క్లీనర్లను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. రైతుల ధాన్యం సివిల్ సప్లై ప్రకారం కొనుగోలు చేయాలన్నారు. డీసీఎస్‌ఓ ఎస్.జితేందర్‌రెడ్డి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ జితేంద్రప్రసాద్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎన్.శ్రీనివాస్, జిల్లా రవాణా అధికారి వై.కొండల్‌రావు, జిల్లా సహకార అధికారి బుద్ధనాయుడు, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాశ్, జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్, తహసీల్దార్లు, రైస్ మిల్లర్లు, పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.